సాక్షి
నిర్మల్
బుధవారం • 4 • జనవరి • 2023



ఐదు హత్యల కేసులో ఒకరికి జీవిత ఖైదు 8లో▸

భైంసా పట్టణంలో 2016లో సంచలనం సృష్టించిన ఐదుగురి హత్య కేసులో నిందితుడికి జిల్లా కోర్టు జీవిత ఖైదుతోపాటు, రూ.25 వేల జరిమానా విధించింది.



సావిత్రీబాయికి నివాళి 9లో▸

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.4 / 18.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. గాలిలో తేమ పెరుగుతుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

వైద్యానికి కొత్త సైన్యం

- జిల్లాకు కొత్తగా 13 మంది వైద్యుల నియామకం
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో నలుగురు..
- డైరెక్టర్ హెల్త్ పరిధిలో 9 మంది నియామకం
- మెరుగు పడనున్న సర్కార్ వైద్యం



జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నూతన డాక్టర్లు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత తీరుస్తోంది. ఇప్పటి వరకు తాత్కాలిక పద్ధతిలో వైద్యులను నియమించారు. అయితే వారు మధ్యలోనే వెళ్లిపోవడంతో పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో నాడి పట్టేవారు లేక రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా శాశ్వత వైద్యుల నియామకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నూతన వైద్యులకు శనివారం నియామక ఉత్తర్వులు అందించి దిశానిర్దేశం చేశారు.

7 పీహెచ్‌సీలకు.. 9 మంది

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని 18 పీహెచ్‌సీలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 మంది రెగ్యులర్ వైద్యులను నియమించాల్సి ఉంది. వైద్య ఆరోగ్య శాఖ మంగళవారం నాటికి ఆయా పీహెచ్‌సీల పరిధిలో 9 మంది వైద్యులు జాయిన్ అయ్యారు. నర్సాపూర్, కుంటాలలో ఇద్దరు చొప్పున, మహాగావ్, మామడ, లక్ష్మణచందా, కడెం, బాసరలో ఒక్కొక్కరు నియమితులయ్యారు. జిల్లాలో రెగ్యులర్ వైద్యుల సంఖ్య 21కి పెరిగింది.

టీవీవీపీ పరిధిలో నలుగురు...

తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో మొత్తం నలుగురు వైద్యులు జాయిన్ అయ్యారు. జిల్లా ఆసుపత్రిలో ముగ్గురు, ముధోల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఒకరు సోమవారం నుంచి విధులకు హాజరవుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్మల్ మెడికల్ కాలేజీ మంజూరు చేసిన సందర్భంగా జిల్లా ఆసుపత్రికి 23 మంది సీనియర్ రెసిడెంట్‌లను నియమించగా ప్రస్తుతం 18 మంది విధులు నిర్వహిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యులను నియమించడం శుభసూచకం. నూతనంగా నియమితులైన వైద్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందజేయాలి. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి.

– డాక్టర్ ధనరాజ్, డీఎంహెచ్‌వో

అన్ని రకాల వైద్య సేవలు..



ప్రస్తుతం టీవీవీపీ పరిధిలో నలుగురు వైద్యులు జాయిన్ అయ్యారు. జిల్లా ఆస్పత్రిలో ముగ్గురు, ముధోల్‌లో ఒకరు రిపోర్ట్ చేశారు. ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు మెరుగ్గా అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతన నియామకాలు చేపడుతుంది.

– దేవేందర్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రిలో పర్యవేక్షకులు

50 పల్లె దవాఖానాల ద్వారా సేవలు...

ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పల్లె దవాఖానాల ఏర్పాటుతో ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుతోంది. పేద, మధ్య తరగతివర్గాలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏడాది క్రితమే పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. ప్రారంభంలో డాక్టర్ల కొరత ఉండడంతో మొదటగా జిల్లాలో 17 సెంటర్ల ద్వారా మాత్రమే పేదలకు వైద్య సేవలు అందాయి. తాజాగా రెండో విడతలో 33 దవాఖానాలకు వైద్యుల నియామక ప్రక్రియ పూర్తి కావడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 50 పల్లె దవాఖానాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఈ సబ్ సెంటర్లలో కేవలం టీకాలు, తల్లీబిడ్డలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. ఏఎన్ఎంల ఆధ్వర్యంలో కొనసాగిన ఈ సెంటర్లు ప్రస్తుతం ఎంబీబీఎస్ వైద్యుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందే చికిత్సల్లో దాదాపు 80 శాతం వరకు వైద్య సేవలు ఈ పల్లె దవాఖానాల ద్వారా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలతో బాధపడుతున్న వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ఏర్పాట్లు చేశారు. పల్లె ప్రజలకు సంబంధించి గుండె జబ్బులు, క్యాన్సర్లు, బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు, సలహాలు ఇస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి మందులు అందిస్తున్నారు.

న్యూస్‌రీల్

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ చైర్‌పర్సన్



శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి–రాంకిషన్‌రెడ్డి దంపతులు మంగళవారం కలిశారు. మొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, పట్టణ సీఐ శ్రీనివాస్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, చలనచిత్ర టీవీ కళాకారుల సంఘం అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి నరసయ్య, టీఎన్జీవోస్ సభ్యులు కూడా మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీఎస్ మీసేవ నిర్మల్ జిల్లా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో టీఎస్ మీసేవ జిల్లా అధ్యక్షుడు అజాహర్ హుస్సేన్, జనరల్ సెక్రెటరీ అబ్దుల్ ఖలీద్, స్టేట్ సెక్రెటరీ సాహెబ్, ట్రెజరర్ షేక్‌నాబి, వర్కింగ్ ప్రెసిడెంట్ హైమద్ సాహెబ్, జిల్లా కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

7న అసెంబ్లీ సమ్మేళనం



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

లక్ష్మణచాంద: ఈనెల 7న బీజేపీ అసెంబ్లీ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పార్టీ నిర్మల్ నియోజకవర్గ పాలక్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమ్మేళనంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా వర్చువల్ మాట్లాడుతారని పేర్కొన్నారు. మండలస్థాయి, బూత్‌స్థాయి అధ్యక్షులు తప్పనిసరిగా సమ్మేళనంలో పాల్గొనాలని తెలిపారు. మండల కేంద్రంలో బూత్‌స్థాయి అధ్యక్షులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బూత్‌స్థాయి అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో మండలంలోని ప్రతీ గ్రామంలో బీజేపీ బలోపేతం అయ్యేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళి, మెడిసమ్మె రాజు, ప్రధాన కార్యదర్శి కమల్ నయన్, నాయకులు పాల్గొన్నారు.

వాసుదేవాచార్యను కలిసిన బీజేపీ నాయకులు



వాసుదేవాచార్యతో బీజేపీ నాయకులు

భైంసాటౌన్: ఆధ్యాత్మిక గురువు, అయోధ్య రామమందిర నిర్మాణ శిలాన్యాస కార్యక్రమంలో పాల్గొన్న వాసుదేవాచార్య విద్యాభాస్కర్ స్వామీజీని పలువురు బీజేపీ నాయకులు కలిశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భక్తులకు ఉపదేశం కోసం మంగళవారం ఆయన భైంసాకు వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓం ప్రకాష్‌లడ్డా నివాసంలో పవార్ రామారావ్‌పటేల్‌తోపాటు పలువురు నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు. నాయకులు రవి పాండే, బాలాజీ సూత్రావే, రమేష్ చంద్ర మాంధాని, తూమోల్ల దత్తు పాల్గొన్నారు.

నేడు లూయిా బ్రెయిలీ జయంతి

నిర్మల్‌చైన్‌గేట్: అంధుల కోసం లిపి తయారు చేసిన లూయిా బ్రెయిలీ 214 జయంతిని బుధవారం నిర్వహించనున్నట్లు డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. జిల్లాలోని అంధులు ఉదయం 11 గంటలకు జిల్లా మహిళా, శిశు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయానికి రావాలని కోరారు.

వాహనాల వేలం

భైంసాటౌన్: పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం పలు వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 68 వాహనాలను ఏఎస్పీ కిరణ్‌ఖారె ఆధ్వర్యంలో వేలం ద్వారా విక్రయించారు. వేలం ద్వారా రూ.5.05 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

అడెల్లి పోచమ్మ ఆలయ ఉద్యోగిపై చర్య తీసుకోవాలి

సారంగాపూర్: అడెల్లి మహాపోచమ్మ దేవాలయంలో పనిచేసే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఆలయ రాజగోపురం ఎదుట అడెల్లి గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ మంగళవారం ధర్నా చేశాడు. విషయం తెలుసుకున్న ఆలయ సిబ్బంది రమణారావు అక్కడకు చేరుకుని అసలేం జరిగింది, ఎవరిపై చర్యలు తీసుకోవాలి అని అడగగా ఆలయంలో వంటమనిషిగా పనిచేసే వ్యక్తి తరచూ మద్యం సేవించి ఆలయం వద్ద న్యూసెన్స్ చేస్తున్నాడని తెలిపాడు. అయినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అయితే ఇదివరకే సదరు వంటమనిషిపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆలయం ఎదుట ధర్నా చేసిన శేఖర్‌గౌడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని శేఖర్‌గౌడ్‌ను పంపించారు.

తల్లుల చెంతకు శిశువులు 10లో▸

దివ్యాంగ విద్యార్థులకు భరోసా

- విద్యాభివృద్ధికి ప్రభుత్వం కీలక నిర్ణయం
- 6 నుంచి 10 తరగతి వరకు ఉత్తీర్ణత మార్కులు తగ్గింపు
- వైకల్యం ఆధారంగా 10 నుంచి 20 మార్కులకే పాస్
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు



పాఠశాలలో దివ్యాంగ విద్యార్థి(ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: శారీరక వైకల్యం కారణంగా చదువుకు దూరమవుతున్న వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగులకు విద్యను మరింత చేరువ చేసే దిశగా మరో అడుగు ముందుకేసింది. వివిధ పరీక్షల్లో కనీస ఉత్తీర్ణత మార్కులను తగ్గించడంతోపాటు సహాయకులను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తూ జీవో 27 జారీ చేసింది. దీంతో జిల్లాలోని సుమారు 220 మంది విద్యార్థులకు మేలు చేకూరనుందని అధికారులు అంచనా వేశారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న వారికి ఎనిమిది విభాగాల్లో ఈ సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో వారికి లబ్ధి కలుగుతుంది.

సబ్జెక్టు ఫెయిలైనా..

వైకల్యం ఎక్కువగా ఉండి ఏదైనా కారణంతో ఓ పరీక్ష రాయలేకపోయిన వారిని సైతం ఉత్తీర్ణులుగా పరిగణించే వెసులుబాటు కల్పించారు. కొన్ని సబ్జెక్టులను సైతం మినహాయించారు. కనీస ఉత్తీర్ణత మార్కులు 35 ఉండగా కొన్ని విభాగాల వారికి 10 మార్కులకు తగ్గించారు. మరికొన్ని విభాగాల వారు 20 మార్కులు సాధించినా పాస్ అయినట్లుగానే పరిగణిస్తారు.

ఈ విద్యాసంవత్సరం నుంచే...

2022–23 విద్యా సంవత్సరం నుంచి దివ్యాంగ విద్యార్థులకు పరీక్షల్లో కనీస ఉత్తీర్ణత మార్కులు కుదించాలని ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. కనీస ఉత్తీర్ణత మార్కులు 35 నుంచి పది మార్కులకు, మరికొన్ని విభాగాలకు 20 మార్కులకు కుదించారు. కొన్ని విభాగాలకు సబ్జెక్టులను సైతం మినహాయించింది.

వీరికి మినహాయింపు..

దివ్యాంగ విద్యార్థుల వైకల్య తీవ్రత ఆధారంగా వీరిని ఎనిమిది విభాగాలు విభజించి ఉత్తీర్ణత మార్కుల్లో మినహాయింపు ఇవ్వనున్నారు. ఫిజికల్ డిసెబిలిటీ హియరింగ్ (చెవిటి), స్పీచ్ (మూగ), విజువల్ (కంటి), లాంగ్వేజ్, ఇంటలెక్చువల్(మానసిక) వైకల్యం, మెంటల్ బిహేవియర్, దీర్ఘకాలిక నరాల క్షీణత, మల్టిపుల్ డిసెబిలిటీస్‌గా విభజించారు.

229 మంది దివ్యాంగులు..

జిల్లాలో వివిధ పాఠశాలల్లో 229 మంది దివ్యాంగులు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే వీరిలో కేవలం 49 మందికి మాత్రమే సదరం సర్టిఫికెట్ ఉన్నట్లు పేర్కొన్నారు. సర్టిఫికెట్ ఉన్నవారికే జీవో 27 వర్తిస్తుందని వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ జీవో జారీ చేయడంతో దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 49 మంది దివ్యాంగ విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సడలింపు ఇలా..

- కుష్టు, సెరిబ్రల్, పాల్సీ, మరుగుజ్జులు, కండరాల క్షీణత, యాసిడ్ దాడి బాధితులకు కనీస ఉత్తీర్ణత మార్కులు 35 నుంచి 10కి తగ్గించారు. ఆయా సబ్జెక్టుల్లో 10 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. పరీక్ష సమయంలో కాలిక్యులేటర్, కంప్యూటర్ వినియోగించుకోవచ్చు. ఒక సబ్జెక్టును సైతం మినహాయించారు.
- మానసిక వైకల్యం ఉన్నవారికి కనీస ఉత్తీర్ణత మార్కులను 10కి తగ్గించారు. వారు రాయాల్సిన పరీక్షల్లో మూడు భాషల్లో ఏదైనా ఒకటి రాసేలా అవకాశమిచ్చారు.
- ఆటిజం, స్పెక్ట్రమ్ వైకల్యంతో బాధపడుతున్న వారికి కనీస ఉత్తీర్ణత మార్కులను 10కి తగ్గించారు. వీరికి కూడా భాష పరీక్షల్లో రెండింటిని మినహాయించారు.
- డిస్లెక్సియా, డిస్ప్రియా, డిస్క్యాలకులియా, డిస్ ప్రాక్సియా, ఆఫీసియా తదితర అభ్యసన లోపాలతో బాధపడుతున్న దివ్యాంగులకు కూడా మూడు భాషల్లో ఏదో ఒకటి రాసేలా అవకాశమిచ్చారు. కనీస ఉత్తీర్ణత మార్కులు 20 సాధించాల్సి ఉంటుంది.
- భాష ఉచ్ఛరణ సంబంధ వైకల్యం ఉన్నవారి జవాబు పత్రాలను శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయిస్తారు. వినికిడి లోపం ఉన్నవారికి సైగలతో సహకరించేవారిని నియమించుకోవచ్చు. వినికిడి పరికరాలు సైతం ఉపయోగించుకోవచ్చు.

ఈ ఏడాది నుంచే అమలు..



దివ్యాంగ విద్యార్థులకు కనీస ఉత్తీర్ణత మార్కులను తగ్గిస్తూ ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాలను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తాం. ఎనిమిది విభాగాల్లో విద్యార్థులకు కొందరికి కనీస ఉత్తీర్ణత మార్కులు 20, మరికొందరికి 10 మార్కులు తగ్గించడమే కాకుండా మరికొన్ని సడలింపులు కూడా ఇచ్చింది. అయితే విద్యార్థులు సంబంధిత వైకల్యం ధ్రువపత్రాలు కలిగి ఉంటేనే సడలింపునకు అర్హులు.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

ప్రజల భద్రత, రక్షణే పోలీసుల లక్ష్యం

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ప్రజల భద్రత, రక్షణే పోలీసుల లక్ష్యమని ఇందుకోసం ప్రతీ పోలీసు పునరంకితం కావాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో 2023 నూతన సంవత్సర పోలీస్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపర్చుకుని, శాంతి భద్రతల పరిరక్షణకు మరింత పదును పెట్టాలని సూచించారు. ఆపద సమయంలో బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీటీంలు మరింత పటిష్టంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఆర్థిక నేరాలను అరికట్టడానికి రాత్రి సమయంలో పెట్రోలింగ్ వాహనాలు పటిష్టంగా గస్తీ చేయాలని తెలిపారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై నిఘా పెంచాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాల నిఘా మరింత విస్తరించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, నిర్మల్ పట్టణ సీఐ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐలు హతిరాం, రామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విరాసత్‌అలీ, సభ్యులు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



డయాలసిస్ విభాగాన్ని పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల జిల్లా ఆసుపత్రి రాష్ట్రస్థాయిలో మొదటి అవార్డు సొంతం చేసుకున్న సందర్భంగా పీర్ అసెస్మెంట్‌లో భాగంగా జిల్లా ఆసుపత్రిని కాయకల్ప బృందం మంగళవారం సందర్శించింది. ఉట్నూరు జిల్లా ఆసుపత్రికి చెందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మహేశ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విమల, హెడ్‌నర్సు సునీత, స్టాఫ్‌నర్సు శ్రీలత పరిశీలించారు. ఆసుపత్రిలోని ఓపీ, క్యాజు వాలిటీ, డయాలసిస్, ఓటీ, మెడికల్ వార్డు, ఐసీయూ, సర్జికల్ వార్డు, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, బ్లడ్ బ్యాంక్, ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. బృందం వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ఆసుపత్రి ఆర్ఎంవో వేణుగోపాలకృష్ణ, కాయకల్ప కోఆర్డినేటర్ డాక్టర్ అమీనాషహవార్, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, హెడ్‌నర్సు శోభ, ఆఫీస్ సూపరింటెండెంట్ రఘునాథ్, ఫార్మసిస్ట్ శ్రీనివాసచారి, రేడియోగ్రాఫర్ అబూ అమీర్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



పరిసరాలు పరిశీలిస్తున్న రాజేందర్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ మంగళవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలను సిబ్బంది ఎప్పటికప్పుడు సందర్శిస్తూ గ్రామీణులకు అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వర్, పీహెచ్‌వో శ్రీనివాస్, నాగరాజు, ఆరోగ్యవిస్తరణ అధికారి వేణుగోపాల్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

‘భైరి నరేశ్, రెంజర్ల రాజేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి’



సీఐకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని కించపరిచేలా మాట్లాడిన రెంజర్ల రాజేశ్‌ను అరెస్టు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల భైరి నరేశ్ అయ్యప్పను కించపరిచేలా మాట్లాడితే ఒక్క బీఆర్ఎస్ నాయకుడు కూడా స్పందించలేదన్నారు. ఇప్పుడు రెంజర్ల రాజేశ్ బాసర సరస్వతి అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. వెంటనే వారి పై పీడీయాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సంస్కృతిని కించపరిస్తే ఊరుకోం

హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కించపరిస్తే ఊరుకునేది లేదని బీజేపీ నాయకులు పవార్ రామారావ్‌పటేల్ అన్నారు. బాసర జ్ఞానసరస్వతి అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజేశ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు రవి పాండే, గోపాల్ సర్డా, బాలాజీ సూత్రావే, కౌన్సిలర్ దశరథ్, వడ్నప్ శ్రీనివాస్, తూమోల్ల దత్తాత్రి, ఎంపీటీసీ రజాక్ పాల్గొన్నారు

‘కంటి వెలుగు’ విజయవంతం చేయాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సీఎస్ సోమేశ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ రెండో విడత కార్యక్రమం ఈనెల 18 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు షెడ్యూల్ రూపొందించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో గ్రామాల్లో, వార్డులలో ప్రజలంతా కంటి వెలుగు శిబిరాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అతి పెద్ద కమ్యూనిటీ స్క్రీనింగ్‌ను విజయవంతంగా పూర్తిచేసి గిన్నిస్ రికార్డు సాధించాలన్నారు.

వంద పని దినాల్లో శిబిరాలు..

జిల్లాలో జనాభాకు అనుగుణంగా వంద పని దినాలలో శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతీ కంటి వెలుగు బృందంలో మెడికల్ ఆఫీసర్, అప్తామాలజిస్టు, ఇద్దరు ఏఎన్ఎం, ముగ్గురు ఆశ వర్కర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారని తెలిపారు. వైద్య బృందానికి రోజుకు రూ.1500 చొప్పున భోజనం, వసతి కోసం అందిస్తామని తెలి పారు. బృందం సభ్యులు స్థానికంగా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేయడానికి పంచాయతీలు, మున్సిపాలిటీలకు ప్రతి రోజూ రూ.వెయ్యి చొప్పున విడుదల చేస్తామని పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

విజయవంతం చేద్దాం..

అనంతరం రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందు చూపుతో పెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. గ్రామాల్లో కంటి చూపు సమస్యతో బాధపడే వారి బాధలు తీర్చేందుకు కంటి వెలుగు దోహద పడుతుందని తెలిపారు. విజయవంతం చేసేందుకు సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, అధికారులు, డీఆర్డీవో విభాగం కలిసి పనిచేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ ముషరఫ్ అలీ, అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ధనరాజ్, జెడ్పీ సీఈవో సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న మెస్రం వంశీయుల పాదయాత్ర

నార్నూర్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేకపూజ కోసం గంగాజలాన్ని తీసుకురావడానికి మెస్రం వంశీయులు చేపట్టిన పాద యాత్ర మంగళవారం గుండాలకు చేరింది. ఇక్కడే బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి లోకారి బీ గ్రామానికి పాదయాత్రగా బయలుదేరారు. అక్కడ బస చేసి బుధవారం మండలంలోని మల్కుగూడ గ్రామానికి చేరుకుంటారు. ఆయా కార్యక్రమాల్లో మెస్రం హన్మంతరావు కటోడ, మెస్రం తుక్డోజీ పర్దాన్, తిరుపతి కోత్వాల్, వంశ పెద్దలు మెస్రం నారంజీ పటేల్, మెస్రం శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గుండాల గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు

క్లుప్తంగా

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన ఆత్రం కృష్ణ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్రం కృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా తిరుగుతుండేవాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం 8గంటల సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం 6గంటలకు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లున్నారు.

అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య



వికేశ్ (ఫైల్)

లక్ష్మణచాంద: అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వికేశ్ (36) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాహుల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

ముథోల్: మండల కేంద్రానికి చెందిన భారమొల్ల గణేశ్ (19) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. భారమొల్ల హన్మాండ్లు కుమారుడు గణేశ్ సోమవారం రాత్రి పొలానికి వెళ్తాన్నానని బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం తన తమ్ముడు యోగేశ్ పొలానికి వెళ్లి చూడగా బొబ్బిలి చెట్టుకు ఉరేసుకుని చనిపోయి ఉండడం గమనించాడు. మృతుడు మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు తండ్రి హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యను అడ్డుకున్న పోలీసులు

- కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగింత



బాధితుడితో సోన్ పోలీసులు

లక్ష్మణచాంద: ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ వ్యక్తిని సోన్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంటాల మండల కేంద్రానికి చెందిన సిర్ల భోజన్న కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. సోన్ మండల కేంద్రంలోని గోదావరి బ్రిడ్జి వద్దకు మంగళవారం మధ్యాహ్నం చేరుకున్నాడు. బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకేందుకు యత్నించాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న సోన్ పోలీస్‌స్టేషన్‌లో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న విక్టర్ పాల్, సూర్యభాను అతడిని వారించారు. భోజన్నను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విక్టర్‌పాల్, సూర్యభానును ఎస్సై రవీందర్ అభినందించారు.

మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన డీపీఆర్వో

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మిని మంగళవారం డీపీఆర్వో తిరుమల వేరువేరుగా వారి స్వగృహాలోకల మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రికి పూలమొక్క ఇస్తున్న డీపీఆర్వో విజయలక్ష్మి

మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

ఖానాపూర్: పట్టణాలతోపాటు మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మత్స్య సహకార సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ బొజ్జ నారాయణ కోరారు. పట్టణంలో చేపల మార్కెట్‌ను మంగళవారం సందర్శించి మాట్లాడారు. మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో మత్స్యకారులు ఏళ్లుగా రోడ్డు పక్కన వీధుల్లో అసౌకర్యాల మధ్య చేపలు విక్రయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వెంటనే ఆధునిక సౌకర్యాలతో కూడిన మార్కెట్లు నిర్మించాలని కోరారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వంతోపాటు మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీ నివాస్, ఆ శాఖ కమిషనర్ లచ్చిరాం నాయక్‌కు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివయ్య, చిన్నయ్య, నాగరాజు, రవీందర్, మల్లేశ్, రాము, ప్రవీణ్, భీమేశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో రోడ్డుపై చేపలు విక్రయిస్తుండగా పరిశీలిస్తున్న నాయకులు

ఐదు హత్యల కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిర్మల్‌టౌన్: 2016లో భైంసా పట్టణంలో సంచలనం సృష్టించిన ఐదుగురి హత్య కేసులో నిందితుడికి జిల్లా కోర్టు జీవిత ఖైదుతోపాటు, రూ.25 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భైంసా పట్టణంలో 2013లో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగగా దానికి సంబంధించిన కేసులో ఒక కుటుంబం ఫిర్యాదు చేయగా ప్రత్యర్థి కుటుంబం వారికి కోర్టు శిక్ష విధించింది. దీంతో కక్షగట్టిన ప్రత్యర్థి కుటుంబానికి చెందిన మజీద్, మరో వ్యక్తి 2016 మే 5న భైంసా చౌరస్తాలో ఆ కుటుంబానికి చెందిన ఇద్దరినీ తల్వార్లతో అతి కిరాతకంగా నరికి చంపారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబంలోని మరో ముగ్గురినీ తల్వార్లతో నరికి హత్య చేశారు. వీరిలో ఒకరు కోర్టు ట్రయల్‌లోనే అనారోగ్యంతో మరణించగా, మాజీద్‌కు జిల్లా కోర్టు సోమవారం జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన సిబ్బందితోపాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డిని ఎస్పీ సన్మానించారు. భైంసా ఏఎస్పీ కిరణ్ ఖారే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, భైంసా పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, లైసన్ అధికారి సక్రియానాయక్, అసిస్టెంట్ లైసన్ అధికారి శంకర్ పాల్గొన్నారు.



పీపీ రమణారెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ

ఏజెన్సీ ఏరియాను రీషెడ్యూల్ చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలో రాష్ట్ర విభజన చట్టంలో ఉన్నట్లుగా రీషెడ్యూల్ చేయాలని తెలంగాణ రాష్ట్ర నాన్‌ట్రైబల్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భారత్ వాగ్మారే, ప్రధాన కార్యదర్శి మల్లెపూల నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి జిల్లాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాన్ ట్రైబల్స్ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్న గ్రామాలను ఏజెన్సీ నుంచి తొలగించాలన్నారు. సుప్రీం కోర్టు జీవో నంబర్ 3 ను కొట్టివేసినందున విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో నాన్‌ట్రైబల్స్‌కు 50 శాతం అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నాన్ ట్రైబల్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. తెలంగాణ రాష్ట్ర నాన్ ట్రైబల్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు నాగోరావు జాడే, గౌరవాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ ఫయ్యాజ్, నాయకులు బుట్టోఖాన్, ఉత్తం, తిరుపతి, గోపాల్‌సింగ్, ప్రజ్ఞశీల్, ఉద్ధవ్ కాంబ్లే, దయానంద్, సంజీవ్, సంజయ్, విశ్వనాథ్, జైనొద్దీన్, బ్రిడ్జిలాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్

ఠాణాకు చేరిన గేదె పంచాయితీ

నేరడిగొండ: చోరీలు, ఘర్షణలు, ఇతర కేసులు పోలీస్‌స్టేషన్‌కు రావడం సాధారణం. కానీ.. మంగళవారం నేరడిగొండ ఠాణకు కొత్తగా ఓ గేదె కేసు వచ్చింది. వివరాలు.. మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కిషన్ అనే రైతు ఖాతాలో ఇటీవల రైతుబంధు డబ్బులు జమయ్యాయి. అందులోంచి తనకు రూ.5వేలు ఇవ్వాలని అతడి కుమారుడు మారుతి కోరాడు. లేకుంటే ఉన్నొక్క గేదెను అమ్మేస్తానని చెప్పాడు. దీంతో సదరు రైతు సర్పంచ్ జంగ్‌కు విషయాన్ని తెలిపాడు. సర్పంచ్ సముదాయించే ప్రయత్నం చేయగా వినకపోవడంతో ఏకంగా బర్రె పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. బర్రెతో పాటు తండ్రీకొడుకులు 'సార్ మాకు న్యాయం చేయండి' అంటూ స్థానిక పోలీసులను కోరారు. దీంతో నేరడిగొండ ఎస్సై సాయన్న రైతు కుమారుడిని మందలించారు. ఉన్నొక్క గేదె ద్వారా పాలు అమ్మితేనే కుటుంబం గడుస్తుందని, అమ్మితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించగా గేదె పంచాయితీ ముగిసింది.



నేరడిగొండ పోలీస్‌స్టేషన్ వద్ద కట్టేసి ఉన్న గేదె

నీల్‌గాయిని హతమార్చిన ఏడుగురిపై కేసు

పెంబి: నీల్‌గాయిని వేటాడి హతమార్చి మాంసాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పెంబి రేంజ్ ఏఫ్ఆర్వో రామకృష్ణ తెలిపారు. ఎఫ్ఆర్వో తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన సాట్ల చిన్నయ్య, దోసంట్ల శ్రీను, సాట్ల రెడ్డి, సీమల ఎల్లారెడ్డి, నైనేని రాజు, సిర్పెల్లి వెంకటి, కస్తూరి రాజేందర్ కలిసి యాపలగూడ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి నీల్‌గాయిని హతమార్చారు. మాంసాన్ని విక్రయించేందుకు ముక్కలు చేస్తుండగా సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం వారిపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఎస్‌వో కింగ్‌ఫిషర్, ఎఫ్‌బీవోలు ఉదయ్, శివ పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఓ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేస్తున్న కాంబ్లే లఖన్‌పై రిజ్వాన్ అనే వ్యక్తి దాడి చేశాడు. దీంతో రిజ్వాన్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ కాలనీకి చెందిన కాంబ్లే లఖన్ తన కూతురు అనారోగ్యానికి గురి కాగా సోమవారం తిలక్‌నగర్‌లోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడే ఉన్న మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసే సమయంలో ఓ మహిళ అతడి వెనుక నిలబడింది. తానే ముందుగా మందులు తీసుకుంటానని వెనుక నిల్చున్న క్రాంతినగర్‌కు చెందిన మహిళకు లఖన్ చెప్పగా అక్కడే ఉన్న ఆమె భర్త రిజ్వాన్ 'నా భార్యను ఏమంటున్నావ్' అని అతడిని చితకబాదాడు. తన స్నేహితులతో కలిసి కొట్టి గాయపర్చాడు. రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందిన లఖన్ ఫిర్యాదు చేయగా మంగళవారం రిజ్వాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఖాందేవ్ మహాపూజకు సిద్ధం

నార్నూర్: ఈ నెల 6న మండల కేంద్రంలో నిర్వహించే ఖాందేవ్ మహాపూజకు ఆదివాసీ గిరిజనులైన తొడసం వంశస్తులు సిద్ధమయ్యారు. వారి ఆరాధ్యదైవమైన ఖాందేవుడికి ఏటా జనవరిలో వచ్చే పుష్యమాసంలో మహాపూజ నిర్వహిస్తారు. దీనికి దేశంలోని నలుమూలల నుంచి తొడసం వంశస్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. వారి సంస్కృతి, సంప్రదాయం ప్రకారం పూజలు చేస్తారు. అనంతరం ప్రతీ ఇంటి నుంచి సేకరించి తెచ్చిన నువ్వుల నూనెను నైవేద్యంగా సమర్పిస్తారు. వంశ ఆడబిడ్డ వంశస్తుల సమక్షంలో దాదాపు మూడు కిలలో నువ్వుల నూనె తాగడం ఆనవాయితీ. మంగళవారం మాన్కాపూర్ గ్రామంలో నీ ఘానా (యంత్రం) ద్వారా నూనెను తయారు చేశారు. ఉదయం పవిత్ర స్నానం చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆలయ కమిటీ సభ్యుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు.

సావిత్రీబాయి పూలే జయంతి

బాసర(ముథోల్): బాసర ట్రిపుల్ ఐటీలో మంగళవారం సావిత్రీబాయి పూలే జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి డైరెక్టర్ సతీశ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు.

గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరికి జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీకృష్ణ మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు నిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్‌కు చెందిన కరల సత్యపాల్, కొతులే సునీల్ ఇంద్రవెల్లి నుంచి గంజాయిని నార్నూర్‌కు తరలించగా పట్టుబడ్డారు. దీంతో అప్పటి ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ రమణారెడ్డి ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా జడ్జి పైతీర్పు చెప్పారు.

యువకుడి అనుమానాస్పద మృతి



అర్బాజ్‌ఖాన్ (ఫైల్)

జైనథ్: మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్ వద్ద ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన ముజాయిద్‌ఖాన్ కుమారుడు అర్బాజ్‌ఖాన్ (19) ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ నెల ఒకటిన ఉదయం 6గంటలకు టిఫిన్ సెంటర్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కాగా, సాత్నాల ప్రాజెక్ట్ వద్ద అర్బాజ్‌ఖాన్ చెప్పులు, బైక్ కనిపించగా సోమవారం సాయంత్రం జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు గజ ఈతగాళ్లలో సాత్నాలలో గాలించారు. మంగళవారం మధ్యాహ్నం అర్బాజ్‌ఖాన్ మృతదేహం లభించగా పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్సై రాథోడ్ ఆత్మారాం తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



శివలీల(ఫైల్)

ముథోల్: మండలంలోని విఠోలి గ్రామానికి చెందిన వివాహిత శివలీల(రాజశ్రీ) (19) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తానూర్ మండలం హిప్నెల్లి గ్రామానికి చెందిన శివలీలకు విఠోలి గ్రామానికి చెందిన సింగ్నేవార్ సాయినాథ్‌తో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. ఆమెకు పెళ్లి ఇ ష్టం లేకపోవడంతో గత డిసెంబర్ 31న పురుగుల మందు తాగింది. శివలీల నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి పరిస్థితి విషమించి చనిపోయింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జైపూర్ ఏసీపీ వాంగ్మూలం నమోదు

ఆదిలాబాద్‌టౌన్: జైపూర్, జన్నారంలో రెండు భూవివాదాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టులో జైపూర్ ఏసీపీ నరేందర్ వాంగ్మూలం నమోదు చేశారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక జడ్జి ఎం.సతీశ్‌కుమార్ ఆయన వాంగ్మూలం తీసుకున్నారు. 2020 సంవత్సరానికి సంబంధించి కోర్టు ఏసీపీ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఇందులో పీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, లైసన్ అధికారి తాజొద్దీన్ తదితరులున్నారు.

'డాక్టర్‌పై దాడి సరికాదు'

నిర్మల్‌టౌన్: డాక్టర్‌పై దాడి సరికాదని డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని డాక్టర్స్ లైన్‌లో ఫిజియోథెరపీ డాక్టర్ నరేన్‌పై సోమవారం సాయంత్రం పలువురు దాడి చేశారు. నరేన్ క్లినిక్‌లో ఇంతకుముందు సోఫీనగర్‌కు చెందిన షాఫియా కాంపౌండర్‌గా పనిచేసేది. డాక్టర్ వద్ద రూ.10వేలు అడ్వాన్స్‌గా తీసుకుంది. తర్వాత ఆమె వేరే ఆసుపత్రిలోకి వెళ్లిపోయింది. సోమవారం సాయంత్రం సమయంలో క్లినిక్ ముందు షాఫియా కనబడగా డాక్టర్ నరేన్ ఆమె వద్దకు వెళ్లి డబ్బులు అడిగాడు. దీంతో షాఫియా తల్లి షబానా, ఆమె చిన్నమ్మ సుల్తానా డాక్టర్ కాలర్ పట్టుకుని దాడికి ప్రయత్నించారు. అంతటితో ఆగకుండా షాఫియా తన బంధువులను పిలిపించింది. అక్కడకు చేరుకున్న ఆమె బంధువులు జరిగిన విషయం తెలుసుకోకుండా క్లినిక్‌లోకి ప్రవేశించి డాక్టర్‌పై రాడుతో ఇష్టం వచ్చినట్టు కొట్టారు. దీంతో డాక్టర్ పక్క ఆసుపత్రికి వెళ్లాడు. అయినా ఆగకుండా డాక్టర్‌పై దాడి చేస్తూనే ఉన్నారు. వెంటనే డాక్టర్ నరేన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోగా వారిలో కొందరు పరారయ్యారు. ఈ ఘటనలో మొత్తం 11మంది నిందితులున్నారు. వీరిలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రాడు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించి మిగతావారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పక్కన పట్టణ సీఐ

నిజాయితీ చాటుకున్న పోలీస్

నిర్మల్ టౌన్: తనకు దొరికిన బంగారు గొలుసును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నాడు. పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన రాజమణి అనే మహిళ తన బంగారు గొలుసును జిల్లా కేంద్రంలోని గాయత్రీ బ్యాంక్‌లో కుదువపెట్టి రుణం తీసుకుంది. మంగళవారం బ్యాంక్‌లో అప్పు చెల్లించి బంగారు గొలుసు తీసుకొని బయటకు వచ్చే క్రమంలో జారిపడింది. పెంబి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ రఫీక్‌కు బంగారు గొలుసు దొరికింది. వెంటనే దాన్ని తీసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అప్పగించారు. అప్పటికే మహిళ బంగారు గొలుసు పోయిందని వెతుక్కుంటూ బ్యాంక్‌కు వెళ్లింది. ఫలితం లేకపోగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. దీంతో ఐడీ పార్టీ పోలీసులు కూన సందీప్, సురేశ్‌గౌడ్ బ్యాంకు వద్దకు చేరుకొని సీసీ కెమెరాలు పరిశీలించి బాధితురాలిని నిర్ధారించుకున్నారు. పట్టణ సీఐ శ్రీనివాస్ సిబ్బందిని అభినందించారు. బాధితురాలికి చైన్ అప్పగించారు. పోయిన గొలుసు దొరకగా బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.



బాధితురాలికి చైన్ అప్పగిస్తున్న పట్టణ సీఐ

దొరికిన పత్తి దొంగలు

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామశివారు ప్రాంతాల్లో ఇటీవల పత్తి దొంగతనం చేసిన నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసులు వివరాలు వెల్లడించారు. గత డిసెంబర్ 25న అందకూర్ గ్రామానికి చెందిన రవీందర్ రావు అనే రైతు పత్తి ఏరి చేన్లో నిల్వ ఉంచగా.. 3.35 క్వింటాళ్లు, గత డిసెంబర్ 29వ అందకూర్‌కు చెందిన కన్నం లక్ష్మణ్ పంట కల్లం వద్ద నిల్వ ఉంచిన నాలుగు క్వింటాళ్ల పత్తిని ఆటోల్లో ఎత్తుకెళ్లారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మంగళవారం కల్లూర్-కుంటాల రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ఆటోల్లో పత్తిని తరలిస్తున్న మనీశ్, నారాయణ, సాయికృష్ణను పట్టుకుని విచారించారు. దీంతోవారు పత్తిని దొంగతనం చేసినట్లు అంగీకరించారు. రెండు ఆటోలతో పాటు రూ.35,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు రాందాస్, దేవరావు, సిబ్బంది గంగాధర్, జాదవ్ బాబు, శ్యాంనాయక్ తదితరులున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

10నుంచి కడెం ఆయకట్టుకు నీటి విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు ఈ నెల 10నుంచి యాసంగి పంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. పంటలకు నీటిని విడుదల చేయాలని రైతుల సమక్షంలో తీర్మానించారు. వారబందీ పద్ధతిన ఐదు తడులు సాగునీటిని విడుదల చేస్తామని, ఆరుతడి పంటలే వేయాలని సూచించారు. ఎంపీపీ కిషన్, జెడ్పీటీసీ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీక్ అహ్మద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, డీసీ భోజదాసు, నాయకుడు రమేశ్‌రావు పాల్గొన్నారు.

అడవిలో అరుదైన పక్షులు



ఇండియన్ దర్టర్ పక్షి



గ్రే హీడెడ్ ఫిష్ ఈగల్

జన్నారం అటవీ డివిజన్ రకరకాల జంతువులకే కాకుండా అరుదైన పక్షులకు అవాసంగా మారింది. డివిజన్‌లోని మైసమ్మ కుంటలో పక్షుల కిలకిలలు నిత్యం వినిపిస్తుంటాయి. ఈ ప్రాంతంలో ఆసియా దేశాల్లో ఉండే అరుదైన ఇండియన్ దర్టర్ పక్షి, గ్రే హీడెడ్ ఈగల్ మంగళవారం కనిపించాయి. వీటిని డిప్యూటీ కన్జర్వేటర్, జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు తన కెమెరాలో బంధించారు. -జన్నారం